చంద్రబాబు మోసాలను గ్రహించాలి



సంతనూతలపాడులో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు



విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

- తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధం కావాలి
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపు
- కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుపై పెద్ద ఎత్తున పోరుబాట కార్యక్రమం
- సంతనూతలపాడులో కదంతొక్కిన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు
- విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ భారీ ర్యాలీ, అధికారికి వినతిపత్రం

సంతనూతలపాడు: సీఎం చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మరోసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలంతా గమనించి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక చంద్రబాబు తుంగలో తొక్కారని మండిపడ్డారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు భారీగా పెంచినందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఆధ్వర్యంలో సంతనూతలపాడు నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం పెద్ద ఎత్తున పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కదంతొక్కారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ మీదుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక పేదలు చీకట్లో మగ్గాల్సి వస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ ఇస్తే.. ప్రస్తుతం ఆ లబ్ధిదారుల ఇళ్లకు కూడా ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయన్నారు. ఇప్పటికే ఉన్న జీఎస్టీలతో ప్రజలు అల్లాడుతుంటే.. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచమని చెప్పిన చంద్రబాబు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే కరెంటు చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, ఆరు నెలలైనా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మేరుగు నాగార్జున విమర్శించారు. అక్టోబర్‌లో వచ్చిన కరెంటు బిల్లు, నవంబర్లో వచ్చిన కరెంటు బిల్లు, డిసెంబర్లో వచ్చిన కరెంటు బిల్లుల్లో పెరిగిన తేడా కనిపించడంతో ప్రజలు భీతిల్లుతున్నారన్నారు. వందల్లో వచ్చే కరెంటు బిల్లు వేలల్లో రావడంతో కట్టలేక ప్రజలు నరకం చూస్తున్నారన్నారు. బిల్లులు కట్టని వాళ్ల ఇళ్లకు వెళ్లి కరెంటు మీటర్లను విద్యుత్ సిబ్బంది తొలగిస్తున్నారన్నారు. దళిత కాలనీల్లో పేదలను చీకట్లో ఉంచుతున్నారన్నారు. దళితులు, పేదలపై కరెంటు చార్జీల పిడుగులు పడేలా కూటమి ప్రభుత్వం, చంద్రబాబు చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. దళితులకు 200 యూనిట్ల ఉచిత కరెంటును వెంటనే పునరుద్ధరించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులు వినియోగించే వ్యవసాయ పంపుసెట్లకు వెంటనే కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. పోరుబాట కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించగా, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మండలాల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, నాలుగు మండలాల ఎంపీపీలు యద్దనపూడి శ్రీనివాసరావు, బి.విజయమ్మ, అరుణ కోటిరెడ్డి, అంజమ్మ కృష్ణారెడ్డి, చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ గోపువరపు రాజ్యలక్ష్మిచంద్ర, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, జేసీఎస్‌లు దుంపా యలమందరెడ్డి, మంచా హరికృష్ణ, ఎస్.విజయభాస్కరరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చల్లా అంకులు, చీమకుర్తి కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, టి.బాబూరావు, పత్తి కోటు, ఎస్.శేషాద్రి, ఆముదాలపల్లి ప్రమీల రామబ్రహ్మం, ఎం.సులోచన, జి.ఇందిరా సుందరామిరెడ్డి, నాయకులు కే సుధాకర్‌రావు, ఎస్.రమణమ్మ, మండవ వెంకట నారాయణ, ఆలూరి వెంకటేశ్వర్లు, జి.ఓబుల్ రెడ్డి, రవి, పరంధామరెడ్డి, దమ్మాల శ్రీనివాసరావు, వల్లెపు శీను, కే నాగాంజనేయులు, కే వెంకటసుబ్బయ్య, ఎన్.రామాంజనేయులు, రాజబాబు, కే శ్రీనివాసరావు, బలరాంరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చీమకుర్తి నుంచి భారీగా తరలివెళ్లిన నాయకులు...

చీమకుర్తి రూరల్: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతనూతలపాడులో నిర్వహించిన పోరుబాట ధర్నాకు చీమకుర్తి మండలం నుంచి అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ర్యాలీగా సంతనూతలపాడు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తపట్నం నుంచి ఒంగోలు తరలిన నాయకులు...

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నిర్వహించిన పోరుబాట కార్యక్రమానికి ఆ పార్టీ కొత్తపట్నం మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్లు, ద్విచక్రవాహనాలలో పార్టీ జెండాలు కట్టుకుని నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. ఒంగోలు చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని పోరుబాటలో పాల్గొన్నారు. కొత్తపట్నం రెడ్డిపాలెం యూత్, మడనూరు, ఆలూరు, గాదెపాలెం, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, గుండమాల, కె.పల్లెపాలెం, గమళ్లపాలెం, అల్లూరు, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, ఈతముక్కల, సంకువారిగుంట నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, సర్పంచ్‌లు కోడూరి గోపి, కారాని జయరావు, విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, తాతా శ్రీను, శైలేష్, ద్వారం మురళి, కరిముల్లా, రాజుగోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, పురిణి కోటిరెడ్డి, గాదె కోటిరెడ్డి, నాగిరెడ్డి, గాలి ముసలారెడ్డి, అంకమ్మరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో పోరుబాట కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగు నాగార్జునతో వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల నాయకులు



ఒంగోలులో పోరుబాటలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల నాయకులు

చుండూరును సన్మానించిన బత్తుల, జూపూడి



చుండూరు రవిబాబును సన్మానిస్తున్న జూపూడి ప్రభాకరరావు, బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జూపూడి ప్రభాకరరావు శుక్రవారం సన్మానించారు. లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ అధ్యక్షులు బొట్లా సుబ్బారావు, నాయకులు చావలి శివ, కె.కోటి, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ర్యాక్‌లు, విద్యార్థులకు మెటీరియల్ అందజేత

ఒంగోలు సిటీ: ఒంగోలు మండలంలోని కరవది జెడ్పీ హైస్కూల్‌కు రూ.ఐదు వేల విలువైన రెండు పుస్తకాల ర్యాక్‌లు, పదో తరగతి విద్యార్థులకు రూ.మూడు వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను దాత చుండూరి కోటేశ్వరరావు అందించినట్లు హెచ్ఎం పీవీఎస్ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాత, హెచ్ఎం

ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

సంతనూతలపాడు: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి మాలతి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరచడం అంటే రాజ్యాంగాన్ని అవమానపరిచినట్లేనని అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే వాళ్లంతా ఐక్యం కావాలని, మన దేశాన్ని మతాలకతీతంగా నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, సీఐటీయూ మండల నాయకుడు పి.శివన్నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

30వ తేదీ వామపక్షాల నిరసన..

ఒంగోలు టౌన్: అంబేడ్కర్‌ను పార్లమెంటులో దూషించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం వామపక్ష పార్టీల నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 30వ తేదీ ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి సాగర్, జిల్లా కార్యదర్శి సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

సంతనూతలపాడు: చెన్నైకు చెందిన ఇంటెలెక్ట్ డిజైన్ అరిన సాఫ్ట్‌వేర్ కంపెనీ వారి ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్లో 9, 10 తరగతులు చదువుతున్న 80 మంది విద్యార్థులకు 80 వేల రూపాయల మెరిట్ స్కాలర్‌షిప్‌లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ కంపెనీ సర్వీస్ డెలివరీ మేనేజర్ దింటకుర్తి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎంపిక చేయబడిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఉపకార వేతనాలు అందజేస్తున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విజయాలు సాధించిన ప్రముఖుల గురించి వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.వెంకారెడ్డి, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.ఉమామహేశ్వరి, సంబంధిత సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డి.శిరీష, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు

వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షునికి అభినందనలు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన నాగులుప్పలపాడు మండలానికి చెందిన పోలినేని కోటేశ్వరరావును శుక్రవారం పలువురు నాయకులు అభినందించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముూరి కనకారావు, రాష్ట్ర నాయకులు నలమలపు కృష్ణారెడ్డి కేక్ కట్ చేసి కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పాలడుగు రాజీవ్, ప్రసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటేశ్వరరావును అభినందిస్తున్న నాయకులు

ఘనంగా వెజిటెబుల్ డే

ఒంగోలు సిటీ: స్థానిక మంగమూరు రోడ్డులోని నారాయణ కిడ్స్ ప్లే స్కూల్లో వెజిటెబుల్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కూరగాయలు, ఆకు కూరలు ప్రదర్శించి వాటిల్లో ఉండే విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్ల గురించి చిన్నారులకు ఉపాధ్యాయులు వివరించారు. స్టూడెంట్ లెడ్ మూమెంట్‌లో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కొల్లా సౌజన్య, ప్రిన్సిపాల్ జె.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రమ, జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, చిన్నారులు

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సంతనూతలపాడులో శుక్రవారం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 32వ వారం పేదలకు అన్నదానం చేశారు. సంతనూతలపాడు సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందా రెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమార్తె దుంపా అనుపమ జన్మదినోత్సవం సందర్భంగా 300 మందికిపైగా అన్నదానం చేశారు. ట్రస్ట్ ఫౌండర్, ఎన్నారై పాతూరి సంపత్, చైర్మన్ శనగల వెంకటరమణ తదితరులు పర్యవేక్షించారు.

ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం

నాగులుప్పలపాడు: అక్రమంగా నిల్వ ఉంచిన ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వాటిని అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పాలపర్తి రాజా ఆ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.